# చైతన్య గళం
తెలుగు దిన పత్రిక



Pallavi Bhonagiri
Insurance Advisor
95330 82971
70137 85232
pallavibhongiri@gmail.com
Karmanghat, Hyderabad
Multi-Line Agent
Motor - Life - Health
We Find Your Best Rate



సంచిక :157 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి , నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగరం గురువారం 11 -7 -2024 వెల : .రూ. 5.00




# రుణమాఫీ కోసం సర్కార్ కసరత్తు

- నిధుల సమీకరణ కోసం నానా తంటాలు
- మూడు దశల్లో ఇచ్చేలా ప్రణాళికలు

జులై 10 (చైతన్య గళం)హైదరాబాద్,

రైతు రుణమాఫీ పథకానికి నిధుల కోసం నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణ ప్రస్తు తసమయంలో చాల కష్టమైన పనిగా మారింది. గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ క్రమంలె రుణమాఫీ కష్టమైనా ప్రభుత్వం చిత్తశుద్దితో పనిచేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం అనేక మార్గాల్లో కసరత్తు -మిగతా 2 లో



## విడాకులు ఇచ్చినా భరణం ఇవ్వాల్సిందే

-ముస్లిం మహిళ కేసులో సుప్రీం కీలక తీర్పు

న్యూఢిల్లీ,

ముస్లిం మహిళలకు భరణం ఇచ్చే విషయంలో బుధవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. విడాకుల తర్వాత వారు కూడా భరణానికి అర్హులని స్పష్టం చేసింది. 125 సీఆర్‌పీసీ ప్రకారం విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం చెల్లించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో -మిగతా 2 లో

# రహదారుల విస్తరణకు అధిక ప్రాధాన్యం



- ఎన్‌హెచ్ఎ అధికారులతో సమన్వయం చేసుకోవాలి
- భూసేకరణ సమస్యలు రాకుండా రైతులతో చర్చించాలి
- వీలైనంత ఎక్కువ పరిహారం ఇచ్చేలా చూడాలి
- రెండు నెలల్లో హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ
- ఆర్ఆర్ఆర్ బూసేకరణకు ఉన్న అడ్డంకులు తొలగించాలి
- కలెక్టర్లు, అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్ రెడ్డి

జులై 10 (చైతన్య గళం)హైదరాబాద్,

జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలని అన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎన్ హెచ్ఏఐ పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహిం చారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు -మిగతా 2 లో




## కాంగ్రెస్ మార్క్.. మార్పు వచ్చింది

- బల్లిపడిన టిఫిన్లు..చిట్టెలుక పడ్డ చట్నీలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా

జులై 10 (చైతన్య గళం)హైదరాబాద్,

మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక -మిగతా 2 లో



## ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టు సుమోటో విచారణ

- సంయమనం పాటించాలని మీడియాకు సూచన
- జడ్జిల పేర్లు, ఫోన్ నంబర్లు వెల్లడించవద్దని ఆదేశాలు

జులై 10 (చైతన్య గళం)హైదరాబాద్,

ఫోన్ ట్యాపింగ్ విషయంలో సంయమనం పాటించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం పలు కీలక సూచనలు చేసింది. వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసర రాద్ధాంతం చేయొద్దని, జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు బహిర్గతం చేయొద్దని స్పష్టం చేసింది. ఫోన్ నంబర్లు, ఫొటోలు బహిర్గతం చేయొద్దని సూచించింది. అలాగే తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 23కి వాయిదా వేసింది. రాజకీయ నేతలతో పాటు జడ్జిల ఫోన్లు ట్యాప్ చేశారని పత్రికల్లో కథనాలు రావడంతో ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసింది. కేసు విచారణ జరుగుతోందని, నిందితులను అరెస్టు చేసినట్టు -మిగతా 2 లో



## తెలంగాణ డిజిపిగా జితేందర్ నియామకం

- ప్రభుత్వం ఉత్తర్వులు..వెంటనే బాధ్యతలు స్వీకరణ
- సిఎం రేవంత్‌తో మర్యాదపూర్వక భేటీ

2


# అర్హులైన వారికే రైతుభరోసా పెట్టుబడి

- వ్యవసాయ రంగాన్ని కాపాడుకునే ప్రయత్నం
- సన్న,చిన్నకారు రైతులకే చేయూత
- హామీ అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల



జులై 10 (చైతన్య గళం)ఖమ్మం,

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయడం కోసం తమ ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. రైతుభరోసా -మిగతా 2 లో




## తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్,

తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ జరిగింది. 15 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలిలా ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీగా మహేష్ భగవత్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీగా స్వాతి లక్రా,టిజిఎస్‌పి బెటాలియన్ అడిషనల్ డీజీగా సంజయ్ కుమార్ -మిగతా 2 లో

# రుణమాఫీ కోసం సర్కార్ కసరత్తు

(మొదటి తరువాయి)

చేస్తోంది. ఆగస్టు 15లోగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా ప్రతి నెలా తీసుకుంటున్న రుణాలను జాగ్రత్తగా ఖర్చు చేస్తూ, పాత అప్పుల కిస్తీలు కడుతూ ఎంతో కొంత నిధులను ఆదా చేస్తూ వచ్చింది. రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయంలోనూ కొంత మిగులుబాటు అయ్యేలా చూస్తోంది. రైతు రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోంది. ముఖ్యంగా నిధుల సేకరణకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు మార్గాలను ఆలోచించి పెట్టుకుంది. వీటిపై కసరత్తు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించింది.

అదేసమయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ స్థాయిలోనూ ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ నుంచి సేకరించే బడ్జెట్ అప్పులను జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరుతూనే.. భూములను హామీగా పెట్టి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు నెలవారీగా తీసుకుంటున్న బడ్జెట్ రుణాలను ఖజానాలో జమ చేసి పెడుతోంది. ఇప్పటికే రుణమాఫీ పథకం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖజానాలో నిల్వ చేసినట్లు సమాచారం. వాస్తవానికి రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ప్రాథమికంగా అంచనా వేసిన మొత్తం. పథకాన్ని పూర్తిగా అమలు చేసేనాటికి నిధుల మొత్తం తగ్గవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఏదేమైనాఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మేలో 4000 కోట్లు, జూన్‌లో 5000 కోట్ల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించింది. జూలై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లో కొన్ని నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలైలో రూ.6,500 కోట్లు, ఆగస్టులో రూ.5000 కోట్ల మేర రుణం తీసుకోవాలని ముందస్తు ప్రణాళికను నిర్దేశిరచుకుంది. ఆ 11,500 కోట్లలో ప్రభుత్వ వ్యయాలు, పాత అప్పుల కిస్తీలు పోను ఎంతో కొంత ఆదా చేయనుంది.

# రహదారుల విస్తరణకు అధిక ప్రాధాన్యం

(మొదటి తరువాయి)

ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులను పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్డు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్ మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్ హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు ఎన్‌హెచ్ ఏఐ అధికారులు అంగీకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్‌లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్ హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు.

## అర్హులైన వారికే

# రైతుభరోసా పెట్టుబడి

(మొదటి తరువాయి)

పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించింది. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి,




త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని మంత్రి తుమ్మల అన్నారు. ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.

## కాంగ్రెస్ మార్క్..
# మార్పు వచ్చింది

(మొదటి తరువాయి)

సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

## విడాకులు ఇచ్చినా భరణం ఇవ్వాల్సిందే

(మొదటి తరువాయి)

పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్, జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. విడాకుల తర్వాత తమ భర్త నుంచి వారు భరణం కోరవచ్చని తీర్పునిచ్చింది. భరణానికి సంబంధించిన హక్కును కల్పించే ఆ సెక్షన్‌ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. సెక్షన్ 125 వివాహితలకే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుంది. మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద వివాహితలు భరణం కోరవచ్చు. భరణం ఇవ్వడం అనేది దాతృత్వం కాదు. భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొందరు భర్తలు గుర్తించడం లేదు. గృహిణి పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చిందని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ప్రతి నెలా బాధిత మహిళకు 10వేల రూపాయలు ఇవ్వాలని పిటిషనర్ ను సుప్రీంకోర్టు ఆదేశించింది. విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం ఇవ్వాలన్న తెలంగాణ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేశారు పిటిషనర్. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించింది. నిర్వహణ అనేది దాతృత్వం కాదని.. వివాహిత మహిళల హక్కు అని సుప్రీం కోర్టు తెలిపింది. గృహిణి అయిన భార్య మానసికంగా.. తమపై ఆధారపడుతుందనేది భర్తలకు తెలియదా అని, ప్రతీ పరుషుడు గృహిణి పాత్రను గుర్తించాలని జస్టిస్ నాగరత్న అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టు సుమోటో విచారణ

(మొదటి తరువాయి)

కౌంటర్‌లో పేర్కొంది. పలువురు పోలీసు అధికారుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్టు తెలిపింది. ఈ వ్యవహారంపై బుధవారం మరోసారి హైకోర్టు విచారణ చేపట్టింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా కూడా సంయమనం పాటించాలని, ట్యాపింగ్‌కు గురైన జడ్జిల వివరాలను వెల్లడి చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పలు రాజకీయ నాయకులు, హైకోర్టు జడ్జీల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలు వచ్చాయి. వాటిని సుమోటోగా స్వీకరించిన హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. మరోవైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల్ని విచారించిన అధికారులు కీలక విషయాలను రాబట్టారు. అందులో హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశామని నింధితులు విచారణలో ఒప్పుకున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన జడ్జీల పేర్లు ఎక్కడ వాడొద్దు.

## తెలంగాణ డిజిపిగా జితేందర్ నియామకం

-ప్రభుత్వం ఉత్తర్వులు..వెంటనే బాధ్యతలు స్వీకరణ

-సిఎం రేవంత్‌తో మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్,

తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డీజీపీగా ఉన్న రవి గుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారమే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆయన ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ డీజీగా ఆదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. నూతన డీజీపీగా నియమితులైన జితేందర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన అనంతరం బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా ఉన్నారు. తర్వాత దిల్లీ సీబీఐలో.., 2004-06 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించారు.

## తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

(మొదటి తరువాయి)

జైన్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీగా స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ కమిషనర్‌గా సుధీర్ బాబు, ఏసీబీ డైరెక్టర్‌గా తరుణ్ జోషి, మల్టీ జోన్ 1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజిగా రమేష్ నాయుడు, మల్టీజోన్ 1ఐజిగా సత్యనారాయణ,హైదరాబాద్ సీఆర్ హెడ్ కోటర్ డీసీపీగా రక్షితమూర్తి,మెదక్ ఎస్పీగా డి. ఉదయ్ కుమార్ రెడ్డి, వనపర్తి ఎస్పీగా గిరిధర్, ఈస్ట్ జోన్ డీసీపీగా బాలస్వామి, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా చంద్రమోహన్ నియమితులయ్యారు.

# జర్నలిస్టు వృత్తి పవిత్రమైనది

**-జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలి**
**-జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు**
**-టీయుడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్**

వనపర్తి జులై 10 (చైతన్య గళం):
జర్నలిస్టు వృత్తి పవిత్రమైనదనీ నిబద్ధతతో పనిచేసి జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలనీ తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజె) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజె(ఐ జెయూ) వనపర్తి జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని తరుని ఫంక్షన్ హాల్ లో నూతనంగా రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికైన మధు గౌడ్ కు అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహిత మధు గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు మానవీయ కోణంలో వార్తలు రాస్తే తగిన గుర్తింపు వస్తుందన్నారు. తొలిసారిగా వనపర్తి జిల్లాకు రాష్ట్ర




పదవి దక్కిందని ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా జర్నలిస్టులకు సేవలందిస్తూనే ఉంటానని అన్నారు. తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఉమ్మడి జిల్లా బాధ్యులుగా ఉన్నప్పటికీ మొదటి ప్రాధాన్యత వనపర్తి జిల్లాకు ఉంటుందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలతో పాటు వారికి ఏ విధమైన సమస్య ఉన్న సంఘం పరంగా పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సహకారంతో తాను ఈ స్థాయికి ఎదిగానని ఎంత ఎదిగిన జర్నలిస్టుల సమస్యల విషయంలో రాజీ లేని పోరాటం చేస్తూనే ఉంటానని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల మౌలిక సదుపాయాల కల్పన కోసం తన వంతు పాత్ర పోషిస్తానని అన్నారు. వనపర్తి జర్నలిస్టుల సంఘటిత శక్తి తన పదవి అని, జర్నలిస్టులు సంకిచిత భావాన్ని వీడి పని చేయాలని అన్నారు. పొగడ్తలు విమర్శలు రెండును స్వీకరించే తత్వం తనదని ఎదుటి వ్యక్తి ఎంత విమర్శించిన నవ్వుతూ స్వీకరించి విమర్శలను మర్చిపోతూ వారితో సఖ్యత ఉండడమే తన బలమని చెప్పారు. త్వరలో ప్రెస్ అకాడమీ నుంచి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించే జీవో రాబోతుందని ఆ పనులు వేగవంతం అవుతున్నాయనీ అన్నారు. జర్నలిస్టుల వైద్య సదుపాయం ఇళ్ల స్థలాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా తరఫున నరసింహ రాజ్ శాలువా పూలమాలలతో ఘనంగా సత్కారం చేశారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నికైన రమేష్ ను సన్మానించారు.

## ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడుకోలు కార్యక్రమం




కల్వకుర్తి జులై 10 (చైతన్య గళం):
కల్వకుర్తి మండలం లోని పంజుగుల గ్రామంలో బదిలీపై వెళుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణయ్య, పాండయ్య, తిరుపతమ్మ ఉపాధ్యాయులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు కలిసి ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఉపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తిరీత్యా గత కొద్ది సంవత్సరాలుగా పంజుగుల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి గ్రామంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు విద్యార్థులు అందరూ సన్మానాలు చేసి మంచి ఉపాధ్యాయులను కోల్పోతున్నామని బాధపడడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య గౌడ్, కల్వకుర్తి బిఆర్ఎస్వి అధ్యక్షులు దారమోని గణేష్, ఉపాధ్యాయులు పుష్పలత, ఉమాదేవి ,రామేశ్వరయ్య, ఆంజనేయులు , శివ కుమార్,వైదూర్య , భాగ్యమ్మ,కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటయ్య, విజయ భాస్కర్,గ్రామ కార్యదర్శి కృష్ణ,జంగయ్య , గ్రామ ప్రజలు షబ్బీర్ ,ఖాజా ,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో మొక్కులు చెల్లించుకున్న గుఱ్ఱం కేశవులు దంపతులు




ఆమనగల్లు జూలై 10 (చైతన్య గళం):
ఆమనగల్లు :పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి భారీ మెజారిటీతో గెలవడంతో ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ,కేశవులు దంపతులు బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనం సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకుని గుర్రం కేశవులు దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, ఆమనగల్లు మండలం అభివృద్ధిలో దూసుకుపోవాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.

# గ్రామీణ రహదారులకు మహార్దశ

**-ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిధుల మంజూరు**

వనపర్తి జులై 10 (చైతన్య గళం):
వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు BT రోడ్ల నిర్మాణానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించారు .వనపర్తి మండల పరిధిలోని చెరువు ముందరి తండా నుంచి పెద్ద తండా వరకు బీటి రోడ్డు నిర్మాణానికి రెండు రూ.2.40 కోట్లు,పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి గ్రామం నుంచి కంచిరావుపల్లి తండా వరకు బీటి రోడ్డు నిర్మాణానికి



రూ.2 కోట్లు,ఖిల్లా గణపురం మండల పరిధిలోని కర్నె తండా నుంచి మేది బావి తండా వరకు బీటి రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్లు,వనపర్తి మండలం PWD రోడ్డు నుంచి చినగుంటపల్లి తండా వరకు బీడీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.37 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని...గత ప్రభుత్వంలో రోడ్ల మంజూరీకి ఎన్ని ప్రయత్నాలు చేసినా నిధులు వాడుకున్నారే తప్ప రోడ్లు మంజూరు చేయలేదని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులను కేటాయించి రోడ్లను మంజూరు చేయించినందుకు వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బిజెపి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాముకు ఘన సన్మానం

**-పాల్గొన్న బిజెపి నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్**

వనపర్తి జులై 10 (చైతన్య గళం):
వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్ లో బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రామ్ ఆధ్వర్యంలో పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ పోతుగంటి రాములు, బిజెపి నాగర్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి భరత్ ప్రసాద్ హాజరయ్యారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నాగర్ కర్నూల్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి భరత్ ప్రసాద్ కు వనపర్తి పట్టణం నుండి 2000 ఓట్ల మెజార్టీ



ఇచ్చినందుకు బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రామును బిజెపి అభ్యర్థి పోతుగంటి భరత ప్రసాద్ శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భరత్ ప్రసాద్ మాట్లాడుతూదేశ ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి పార్టీ మీద నమ్మకంతో వనపర్తి నియోజకవర్గ ప్రజలు బిజెపికి ఓటు వేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలుపేద, మధ్యతరగతి ప్రజలకు అందే విధంగా బిజెపి కార్యకర్తలు కృషి చేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎలక్షన్లలో బిజెపి అభ్యర్థులకు గెలుపు ఖాయమని అన్నారు. వనపర్తి నియోజకవర్గం నుండి పార్లమెంటు ఎన్నికలలో బిజెపి పార్టీకి 63 వేల ఓట్లు రావడం చాలా గర్వించదగ్గ విషయమని ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా భరత్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము మాజీ ఎంపీ రాములు, భరత్ ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు.

## మాజీ ఎమ్మెల్యే వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి



వనపర్తి జులై 10 (చైతన్య గళం):
నారాయణ్ పేట మాజీ ఎం.ఎల్. ఎ రాజేందర్ రెడ్డి వ్యవసాయక్షేత్రం(రాయచూర్)ను మాజీమంత్రి నిరంజన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు సందర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో పండ్ల తోటలు,తాను వ్యవసాయంలో అనుసరిస్తున్న పద్ధతులు సాదుతున్న గొర్రె పోటెల్ల గూర్చి వివరించారు. సౌత్ ఆఫ్రికా నుండి తెచ్చిన గొర్రె పోటేలు ఒక్కక్కటి 70కిలోలు ఉండడాన్ని చూసిన నిరంజన్ రెడ్డి ఇక్కడి వాతావరణ పరిస్థితులకు వాటిని ఎలా సాధుతున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న పంటల సాగు గూర్చి వివరించి మాజీ ఎమ్మెల్యే వ్యవసాయంలో అనుసరించాలసిన మెలుకువలు గూర్చి వివరించారు.అనంతరం వారిద్దరు వ్యవసాయంతో పాటు నేడు రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల గూర్చి చర్చించారు.ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో నిర్వాహకులు రాజేందర్ రెడ్డి ని నిరంజన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య యత్నం



కుత్బుల్లాపూర్ జులై 10 చైతన్య గళం):
మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ లో 3వ సంవత్సరం చదివే హరినాథ్ అనే విద్యార్థి పురుగుల మందు తాగి,ఆ పై వసతి గృహం 3వ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య యత్నంహాస్టల్ బిల్డింగ్ మీదినుండి దూకూతుండగా విద్యుత్ వైర్లు తగిలి తీవ్ర గాయాలు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలింపు

## వాహనదారులకు ట్రాఫిక్ సిఐ హెచ్చరిక

మేడ్చల్ జులై 10 (చైతన్య గళం)
మనిషికి పేరు ఎంత అవసరమో, బండికి నెంబర్ ప్లేట్ అంతే అవసరమని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ అన్నారు.



రాంగ్ రూట్‌లో బైక్‌లు, కారులు, ఇతర వాహనాలేవైనా సరే నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ ట్రాఫిక్ CI హనుమాన్ గౌడ్ వాహనదారులను హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. సైబరాబాద్ కమిషనర్ పరిధిలో రాంగ్ రూట్లో వాహనం నడిపిన వ్యక్తులకు సంబంధించి 150 కేసులు నమోదైనట్లు చెప్పారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 కేసులు నమోదు చేశామని అన్నారు.నెంబర్ ప్లేట్ లేని మరియు రాంగ్ రూట్‌లో వాహనం నడిపిన వారిపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం 200 వాహనాల వరకు సీజ్ చేసి చాలన్లు వేసి కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పారు. వాహనాలకు నంబర్ ప్లేట్ కనిపించేలా పెట్టుకోవాలని సీఐ సూచించారు.. వాహనం రాంగ్ రూట్లో నడపడం ఎంత నేరమో వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా ఉండటం కూడా నేరమేనని అన్నారు.. వాహనాలతో రోడ్డెక్కేముందు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రావుల శేషగిరి ప్రోత్సాహక

కుత్బుల్లాపూర్ జులై 10 (చైతన్య గళం)
గాజులరామారం పరిధిలో ఉన్నటువంటి జడ్పీ స్కూల్లో గత సంవత్సరము చదివినటువంటి పదవ తరగతి విద్యార్థులకు అత్యధిక



మార్కులు సాధించినటువంటి ముగ్గురు విద్యార్థి విద్యార్థులకు బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ శేషగిరి ఆధ్వర్యంలో గుంటుపల్లి శ్రీనివాసరావు, గుడివాడ సురేష్, సురేంద్ర ఒక్కొక్క విద్యార్థికి 5000 రూపాయలు నగదును బహుమతిగా ఇవ్వటం జరిగినది.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయి నేత మురళీకృష్ణ,లక్ష్మణ్,వినయ్ కుమార్,శంకర్,ప్రతాపరెడ్డి,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీ



**ఆమనగల్లు జూలై 10 (చైతన్య గళం):** ఆమనగల్లు పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఏటీడీఓ ఉడుత నూరి వెంకటయ్య తనిఖీ చేశారు. వసతి గృహ రికార్డులను, పరిసరాలను, విద్యార్థులకు సిద్ధం చేసిన వంటకాలను, మరుగుదొడ్లు, మూత్రశాలలను, గదులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకొని వసతి గృహ అధికారి రామచంద్రయ్యకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వసతి గృహ అధికారి రామచంద్రయ్యకు సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కనుగుణంగా మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెంకటయ్య తెలిపారు. ప్రైవేటు కార్పొరేట్ దీటుగా ఆశ్రమ పాఠశాలలో ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత పై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విమల, కవిత, జ్యోతి, సల్మా, కీర్తి, సాంబవి,సునీత పద్మ సంతోష్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ఆమనగల్లు జులై 10 (చైతన్య గళం):** ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు .ఆమనగల్ పట్టణంలో నూతనంగా 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్ తో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు మండలాలకు కూడలి అయిన ఆమనగల్ పట్టణంలో పది పడకలుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పాత భవనాన్ని తొలగించి 50 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచి 17 కోట్ల 50 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు.రాష్ట్రంలో రెండు లక్షల లోపు రైతు రుణాలను ఒకే విడతగా మాఫీ చేసి రైతుల జీవితాలలో వెలుగు నింపడానికి పనిచేస్తామని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వెల్దండ ,ఆమనగల్ , మాడ్గుల మండలాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ తిరుపతి రెడ్డి,మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్,వైస్ చైర్మన్ దుర్గయ్య,కౌన్సిలర్లు అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి-పెద్దమండడి రోడ్డుకు మహార్దశ

**-వనపర్తి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి రూ.148 కోట్లు కేటాయించాలని కోరుతూ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి -వెంకటరెడ్డి కి ప్రపోజల్స్ అందజేసిన వనపర్తి ఎమ్మెల్యే**

**-మొదటి విడతలో పెద్దమండడి రోడ్డు నిర్మాణానికి రూ 40 కోట్లు మంజూరు చేసిన మంత్రి**



**పెద్దమండడి జులై 10 (చైతన్య గళం):** వనపర్తి జిల్లా పెద్దమండడి మండల కేంద్రానికి BT రోడ్డు నిర్మాణానికి 40 కోట్లు మంజూరైనట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు, గ్రామాలకు సంబంధించిన రహదారులన్నింటిని బలోపేతం చేసేందుకు రూ.148 కోట్లు అవసరం ఉన్నట్లు ప్రణాళికలు రూపొందించి వాటి నిర్మాణానికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలంటూ బుధవారం ఎమ్మెల్యే రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కోరుతూ ప్రపోజల్స్ ను అందజేశారు.అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి మొదటి విడతగా రాజనగరం నుంచి పెద్దమండడి మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ. 40 కోట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.దీంతో ఏళ్ల తరబడి రోడ్డు సమస్యతో సతమతం అవుతున్న మండల ప్రజలకు రహదారి ఇబ్బందులు తప్పనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## నూతన ఎస్సై బి. వెంకటేష్ కు ఘనసన్మానం

**-సన్మానించిన ఆమనగల్లు మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు తెల్గమల్ల జగన్**



**ఆమనగల్లు జులై 10 (చైతన్య గళం):** ఆమనగల్లు మండలంలో నూతన ఎస్సైగా బి. వెంకటేష్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు తెల్గమల్లజగన్ ఘనంగా సన్మానించారు. పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగిందని ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వస్పూల మానయ్య, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, వస్పుల శ్రీశైలం, సురేష్, బాబా, ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, అబ్దుల్ ఖాదర్, సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్, మహేష్, ఎన్ఎస్యుఐ తాలూకా నాయకులు ఫిరోజ్, అశోక్, శేఖర్ గౌడ్, మైసయ్య, కాలే మల్లయ్య, మల్లేష్ నాయక్, రఫీ, శివ, గోపాల్, హరిలాల్, సురేష్ నాయక్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



**తలకొండపల్లి జూలై 10 (చైతన్య గళం):** తలకొండపల్లి మండలంలోని పలు పాఠశాలలను రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ ఆకస్మిక తనిఖీనిర్వహించారు. పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చంద్రధన ,ప్రాథమిక పాఠశాల చంద్రదన,జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వెల్జాల్ బాలురు మరియు బాలికల ఉన్నత పాఠశాల వెల్జాల్ ,ప్రాథమిక పాఠశాల వెల్జ ల్. పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేయడం జరిగింది.ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని,డిజిటల్ క్లాసులను క్రమం తప్పకుండా బోధించాలని. ఉపాధ్యాయుల కొరత ఉన్న దగ్గర బాలికలు బాలుర పాఠశాలలు ఒకే కాంపౌండ్ వాల్ లో ఉన్నప్పుడు ఉమ్మడి టైం టేబుల్ తయారు చేసుకొని బోధన జరపాలని మధ్యాహ్న భోజనం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేజీబీవీ పాఠశాలలో భోజనం మెనూ పరిశీలించి విద్యార్థుల చేత పాఠాలు చదివించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.వారి వెంట తలకొండపల్లి మండల విద్యాధికారి,కడ్తాల్ నోడల్ అధికారి జంగయ్య మరియు అమన్ గల్ నోడల్ ఆఫీసర్ పాండు ఉన్నారు

# ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలి





**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**జులై 10 (చైతన్య గళం):ఖమ్మం జిల్లా బ్యూరోఖమ్మం** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ బదిలీలకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, జిల్లా క్యాడర్ పోస్టుల బదిలీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వులలోని నిబంధనల ప్రకారం 4 సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని, అదే సమయంలో 2 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జూలై 9 నుంచి జూలై 12 వరకు బదిలీల కొరకు దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలో నాలుగు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉద్యోగులు, శాఖ పరిధిలోని ఖాళీల తుది జాబితాను రూపొందించి ఉద్యోగస్తులకు అందుబాటులో పెట్టాలని, రెండు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులలోని ప్రాధాన్యత క్రమం వరుసలో బదిలీలు చేపట్టడం జరుగుతుందని, జిల్లా స్థాయి క్యాడర్ బదిలీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బదిలీ కోసం వచ్చిన దరఖాస్తు వివరాలను నమోదు చేసి పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, జిల్లాస్థాయి క్యాడర్ పోస్టుల బదిలీ దరఖాస్తులను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసే కమిటీ పరిశీలిస్తుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ ఎదుట బస్ షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్రాగునీటికీ ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలని, ప్లాస్టిక్ బాటిళ్లు వాడకూడదని, స్టీల్ వాటర్ బాటిళ్లు వాడాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి నెల నెలా వేతనం అందేలా చూడాలన్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ కొరకు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి,జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు,బ్యాగులు వితరణ.

**- గ్రేస్ సర్వీస్ సొసైటీ.**



**జులై 10 (చైతన్య గళం)/నూగూరు వెంకటాపురం :** మండలం లోని టేకులబోరు,రామచంద్రాపురం, మోర్రవానిగుడెం, ఆలుబాక, బర్రెబొంద , ఎదిర గ్రామాల్లోని జి.యస్.యస్ డే కేర్ సెంటర్లోని గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 500 మంది నిరు పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ , పెన్నులు ,గిఫ్ట్ ప్యాకెట్స్ లను మొర్రవాని గూడెం పాఠశాల ఉపాధ్యాయురాలు పండా రాజమ్మ చేతుల మీదుగా డే కేర్ సెంటర్ లోపంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని కోరారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇంఛార్జిలు మొర్రం రాజేష్ , పున్నం ఆంజనేయులు, కనితి ముత్తయ్య, జయరాజు, సాధన, సంతోష్, శంకర్ రావు, స్వప్న సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణరెడ్డి , సతీష్ డే కేర్ సెంటర్ సిబ్బంది, గ్రామస్తులు పలువురు పాల్గున్నారు.